క్లుప్తంగా

గెయిల్ సేవలపై కళాజాత

కరప: సహజవాయువు సామాజిక ఆస్తి అని, దానిని అందరూ కాపాడుకోవాలని హెచ్‌ఎం ఎస్ఎస్ఎస్ఎం శ్రీనివాస్ సూచించారు. మండలం పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణమూర్తి (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నతపాఠశాలలో శనివారం గెయిల్ ఏర్పాటుచేసిన గొర్రెల రాము, కృష్ణ సోదరుల బుర్రకథ సహజవాయువు పైపులైన్ల గురించి, వాటిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ మహాభారతంలోని ఉత్తర కల్యాణం కథ ద్వారా వివరించారు.

విద్యార్థులకు వితరణ

కాకినాడ: ప్రభుత్వ పథకాలు, దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. కస్టమ్స్ చట్టం 60 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం స్థానిక డైరీ ఫారం సెంటర్‌లోని విముక్తి స్కూల్‌లోని విద్యార్థులకు పుస్తకాలు, కుర్చీలు, స్టడీ మెటీరియల్, మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. కస్టమ్స్ హౌస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

కాకినాడ: ఆస్తి, కుళాయి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్టు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శనివారం సాయంత్రం పన్ను వసూళ్లపై సమీక్షించారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్, రెవెన్యూ అధికారులు, సచివాలయ కార్యదర్శులు హాజరయ్యారు. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో మార్చి చివరి నాటికి నూరుశాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం నియమించిన ప్రత్యేక అధికారులు సోమవారం నుంచి వసూళ్లకు చర్యలు తీసుకోవాలన్నారు. యూజర్ చార్జీల వసూళ్లపైనా ఏడీసీ సమీక్షించారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

కాకినాడ రూరల్: రమణయ్యపేట పంచాయతీ పరిధి గైగోలుపాడు సచివాలయం– 4 వద్ద శనివారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలో సేవలు, పరితీరును పరిశీలించారు. డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ ఎల్‌పీసీగా భారతి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): దేవదాయశాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ కాకినాడ జోన్ అధికారిగా దాసరి భారతి నియమితులయ్యారు. ఇప్పటి వరకూ డీసీ విజయరాజు ఎల్‌పీసీగా అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. రెండు రోజులు భారతి విధుల్లో చేరనున్నారు.

ఘనంగా చొల్లంగి తీర్థం

- మొక్కులు తీర్చుకున్న భక్తులు
- యానాం రోడ్‌లో ట్రాఫిక్ రద్దీ



ఉప్పలంక శివారు మొండి స్నానాలరేవు వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

కరప: మండలంలోని ఉప్పలంక శివారు మొండి వద్ద శనివారం సముద్ర తీరాన చొల్లంగి అమావాస్య తీర్థం ఘనంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు వచ్చి పుణ్యస్నానాలు చేశారు. పుష్య అమావాస్యను పురస్కరించుకుని సముద్ర స్నానాలకు వచ్చిన భక్తులతో స్థానిక ఆలయాలు కిటకిటలాడాయి. మొండిలోని బాలా త్రిపురసుందరి సమేత సంగమేశ్వర స్వామి, చొల్లంగిలోని రాజ రాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి, కాలభైరవస్వామి, సీతారాములు, ఆంజనేయస్వాములను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నడకుదురు– గురజనాపల్లి రోడ్, కాకినాడ-యానాం రోడ్ పోటెత్తిన భక్తులతో రద్దీగా మారింది. కరప పరిసర మండలాల నుంచి వీరభద్రుని గద్దె నుంచి ప్రభలను, గరగలతో వచ్చి స్నానాలు చేశారు. అప్పన్నెద్దులను కోలసంబరం పాటలతో ఊరేగుతూ తోలుకుని వచ్చి సముద్ర స్నానం చేయించి సోమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాగరసంగమమైన మొండివద్ద మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ ఇక్కడి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆయన వంశీయులు, దేవదాయశాఖ ఏటా చొల్లంగి తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ మల్లాడి కార్తీక్‌నాయకర్, దేవాదాయశాఖ ఏసీ పి.బాబూరావు భక్తులకు అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. కాకినాడ, కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. చార్టీస్ సిబ్బంది, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. స్నానాలరేవు వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటుచేశారు. ఈఓ పీఆర్టీ ఎస్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, గ్రామసర్పంచ్ బొమ్మిడి నయోమి, ఎంపీటీసీ సభ్యుడు కాలాడి కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, తదితర గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ సిబ్బందితో వైద్యశిబిరం నిర్వహించారు.



సంగమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కన్నబాబు

మొండివద్ద సంగమేశ్వర స్వామిని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు వారికి ఆశీర్వచనం చేశారు.

ఎమ్మెల్యే, ఎంపీలను కలసిన ఎన్‌జీఓ నేతలు

కాకినాడ రూరల్/కాకినాడ సిటీ: ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పసుపులేటి శ్రీనివాస్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీతలనును శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామ మోహన్ రావు, పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ళ చంద్రరావు, కేవీఎస్‌వీ ప్రసాద్, కోశాధికారి వై.పద్మ మీనాక్షి, కాకినాడ యూనిట్ అధ్యక్ష,కార్యదర్శులు షేక్ అజీజ్, ఎ.సత్తిరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి కృషి చేయండి

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ అధ్యక్షురాలిగా నియమితులైన మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆయనను సత్కరించారు. కన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలనపై ప్రజల్లో పూర్తి సంతృప్తి కనిపిస్తోందని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని శివప్రసన్నకు సూచించారు.

జాతీయస్థాయి చెస్ పోటీలకు జైప్రకాష్

కరప: భీమవరంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం అండర్–9 పోటీల్లో మండలంలోని కూరాడకు చెందిన వసుం జై ప్రకాష్ ప్రథమస్థానంలో నిలిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కాకినాడ కేంద్రీయ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. శనివారం నిర్వాహకులు జై ప్రకాష్‌కు మెమెంటోను అందజేశారు.

24న పాటలు, క్విజ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్: కాకినాడ వైఎంసీఏ ఆధ్వర్యంలో ఈనెల 24న పాటల, క్విజ్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పీజే వీకే గాంధీ శనివారం తెలిపారు. స్థానిక కలెక్టరేట్ వెనుక సిటీ ట్యాబర్నికల్ చర్చి ఆవరణలో ఉదయం10 గంటలకు పోటీలు ప్రారంభమౌతాయన్నారు. వివరాలకు 9392233377 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రణాళికాబద్ధంగా గృహనిర్మాణాలు



గృహనిర్మాణంపై సమీక్షిస్తున్న అదనపు కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: నవరత్న పథకాల్లో భాగంగా పేదల ఇళ్ల త్వరగా నిర్మాణమయ్యేలా కాంట్రాక్టర్లు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం నగరపాలక సంస్థ, గృహనిర్మాణశాఖ, మెప్మా సిబ్బంది, కాంట్రాక్టర్లతో గృహనిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. ఏడీసీ మాట్లాడుతూ కొమరగిరి లే అవుట్ రానున్న రోజుల్లో మంచి టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందబోతుందన్నారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ డీఈ గుప్త, నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో కృష్ణమోహన్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. కాగా నరసింహారావు శనివారం మూడో సర్కిల్ పరిధిలోని అయోధ్యనగర్, ఇందిరాకాలనీ, కొత్త కాకినాడల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీలకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు.

గోవుల సంరక్షణకు రూ.50 వేల విరాళం

లంపిస్కిన్ వ్యాధికి గురై మృత్యువాత పడుతున్న గోమాతల రక్షణకు స్థానిక సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు ముందుకు వచ్చారు. వీటి వైద్యానికి అవసరమైన వేక్సిన్ల కోసం రూ.50 వేలు సొంతంగా సమకూర్చారు. శనివారం డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు ద్వారా అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ద్వారా ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌కు శనివారం అందజేశారు. టౌన్‌ప్లానింగ్ సూపరింటెండెంట్ శాస్త్రి, పలువురు సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతీ కుటుంబంలో ఆనందం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- అరట్లకట్టలో గడపగడపకూ

కరప: సీఎం జగన్ అమలుచేస్తున్న నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. శనివారం రెండోరోజు అరట్లకట్టలో ఇంటింటికీ వెళ్లి వారు పొందిన లబ్ధిని వివరించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, సర్పంచ్ గోపి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యురాలు చల్లా కామేశ్వరి తదితరులు స్వాగతం పలికారు. సీఎం జగన్‌ను, తనను ఆశీర్వదించాలని కోరుతూ ముందుకుసాగారు. ఎన్నికల్లో మేకే ఓటు వేసినట్టు 95 ఏళ్ల వృద్ధురాలు పెదిరెడ్డి సీతమ్మ తెలుపగా, ఆమె దగ్గర ఎమ్మెల్యే కన్నబాబు కూర్చుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, రొక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



అరట్లకట్టలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

గణతంత్ర వేడుకల ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ సిటీ: జిల్లా పోలీసు కవాతు మైదానంలో జరుగుతున్న గణతంత్ర దినోత్సవ సన్నాహక ఏర్పాట్లను ఆర్డీవో బీవీ రమణ శనివారం పరిశీలించారు. పురస్కార గ్రహీతలకు, సందర్శకులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, విద్యుత్, పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట అర్బన్ తహసీల్దార్ పి.సీతాపతిరావు, రూరల్ తహసీల్దార్ వి.మురార్జీ తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్‌కు మండల, రూరల్, అర్బన్ డివిజన్ల ఇన్‌చార్జిగా గీసాల, వడ్డి

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని జేసీఎస్ మండల, రూరల్, అర్బన్ డివిజన్ల కన్వీనర్లు నియమితులయ్యారు. కాకినాడ రూరల్ మండల కన్వీనర్‌గా గంగనాపల్లి గ్రామానికి చెందిన గీసాల శ్రీనివాసరావు, రూరల్ నియోజకవర్గంలోని ఎనిమిది అర్బన్ డివిజన్లకు సంబంధించి మాజీ కార్పొరేటర్, మూడో డివిజన్ ఇన్‌చార్జ్ వడ్డి మణికుమార్ నియమితులయ్యారు. జేసీఎస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వారు బాధ్యతలు స్వీకరించారు.

ముగిసిన పవర్‌లిఫ్టింగ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం కళాశాలలో జరిగిన నన్నయ్య వర్శిటీ పవర్ లిఫ్టింగ్ పోటీలు రాత్రితో ముగిసాయి. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నారావు పోటీలను ప్రారంభించారు. 8 కేటగిరిల్లో పోటీలు నిర్వహించారు. వీరిలో విజేతల నుంచి అక్కు జట్టుకు 8 మందిని ఎంపిక చేసి ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు పంజాబ్‌లోని గురుకాశీ వర్శిటీలో జరిగే ఆల్ ఇండియా అంతర్ వర్సిటీ పోటీల్లో పాల్గొననున్నారు. పీఆర్ కళాశాల జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించగా, ఏలూరు ఎస్‌వీఆర్‌కే కళాశాల విద్యార్థి దయాసాగర్ స్ట్రాంగ్‌మెన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు.

రూ. 7,665 విలువైన సరకు జప్తు

కాకినాడ సిటీ: పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణా, రైస్ మిల్లులు, పెట్రోలు బంకులు తదితరాలు నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి శనివారం నిత్యావసరాల చట్టం 6ఏ కింద నమోదైన ఏడు కేసులను విచారించి సీజ్ చేసిన రూ.7,665 విలువైన సరుకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు జేసీ ఎస్.ఇలక్కియ శనివారం తెలిపారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహన యజమానికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. అలాగే వంట గ్యాస్ సిలిండర్‌ను వ్యాపార అవసరాలకు వినియోగించిన దుకాణ యజమానికి రూ.6 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ మొత్తం పౌరసరఫరాల సంస్థ ఖాతాకు జమ అవుతుందన్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన

బోట్‌క్లబ్: స్థానిక జేఎన్‌టీయూకే ఎదురుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రదర్శనలో కలంకారీ చీరలు, వస్త్రాలు, బ్యాంగిల్స్, కలంకారీ మెటీరియల్, ఖాదీ చొక్కాలు, జైపూర్ బెడ్‌షీట్స్, పానిపట్ సోఫా కవర్లు, మైసూర్ పెయింటింగ్‌లు, టెర్రాకోటా ఐటెమ్స్, నాగాలాండ్ డ్రై ఫ్లవర్స్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ, లేడీస్ డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయని మేనేజర్ వై.వెంకటేశ్వరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలు నుంచి రాత్రి 9 గంటలకు వరకూ ప్రదర్శన ఉంటుందన్నారు. సుమారు 50 వేల రకాలు ఐటెమ్స్ ఉన్నాయన్నారు. సెలవు రోజుల్లో కూడా ప్రదర్శన ఉంటుందన్నారు.